వేడుకగా అయోధ్య అక్షింతల ఊరేగింపు


కాచిగూడలో అంక్షింతల కలశాలను ఊరేగిస్తున్న భక్తులు

కాచిగూడ: అయోధ్యలోని శ్రీ రాముని అంక్షితల కలశాలను సోమవారం కాచిగూడ డివిజన్ చెప్పల్ బజార్‌లో భక్తులు వేడుకగా ఊరేగించారు. స్థానిక భక్తులు మేళతాళాలతో బస్తీల్లో, కాలనీల్లోని వీధుల్లో రామనామ సంకీర్తనలతో మహిళలు, భజనలు, కోలాటాలతో కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊరేగింపులో పాల్గొన్న భక్తులకు తిలకం దిద్ది మంగళ హారతులు ఇచ్చి ఎంతో ఆనందోత్సవంతో అక్షింతలు స్వీకరించారు. చెప్పల్ బజార్ హనుమాన్ ఆలయం వద్ద ప్రారంభమైన ఊరేగింపులో శ్రీ రామ జన్మభూమి క్షేత్ర ట్రస్ట్ సభ్యులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిట్టబోయిన నందకిషోర్ యాదవ్, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు శివశంకర్, యశ్వంత్ తిలక్‌రాజ్, దిలీప్, సతీష్, ముత్యాల నరసింహారావు, మహిళ స్వయం సేవలకు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ


పడి పూజలో పాల్గొన్న కృష్ణ యాదవ్, ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్: దేవుని తోటలోని భవానీ శంకర ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వామి మహా పడి పూజను మాలాధారులు శ్రావణ్ గురుస్వామి, వినోద్ గురుస్వాముల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సి.కృష్ణ యాదవ్, బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు హాజరై అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన మండలిచే నిర్వహించిన అయ్యప్ప భక్తి గీతాల కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమంలో కుమార్, నర్సింగ్‌రావు, చుక్కా నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



కవాడిగూడ: బీజేపీ ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్ యాదవ్ స్వామి ఆధ్వర్యంలో దోమలగూడ గగన్ మహల్‌లో ఆయన నివాసం వద్ద అయ్యప్ప మహాపడిపూజను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్, బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్ రావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, పరిమళ్‌కుమార్, జైపాల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, సదానంద్, పెద్ద ఎత్తున అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

గవర్నర్ తమిళసైకి శుభాకాంక్షలు



ముషీరాబాద్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సోమవారం భోలక్‌పూర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అక్లక్ హుస్సేన్ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమెకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

బీసీ కులగణనను తక్షణమే చేపట్టాలి

కాచిగూడ: కులగణన విషయంలో కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమార స్వామి అన్నారు. కాచిగూడలో జరిగిన బీసీ దళ్ రాష్ట్ర కమిటీ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీసీ కులగణన జరగాలని ఎన్నో ఏళ్లుగా కోరుకుంటున్నామని తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే దేశ వ్యాప్తంగా జనగణనలో కులగణన చేపడతామని రాహుల్ గాంధీ ప్రకటించడం శుభ పరిణామమని అన్నారు. బీజేపీ హయాంలో బీసీలకు ఎలాంటి న్యాయం జరగలేదని విమర్శించారు. తాను కూడా బీసీనే అని చెప్పుకుంటున్న ప్రధాని నరేంద్రమోదీ బీసీ కులగణనను తక్షణమే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధాని నిజమైన బీసీ అయితే తక్షణం పార్లమెంట్ ఎన్నికల లోపు బీసీ కుల గణనన చేసి తన నిజాయితీని నిరూపించుకోవాలని అన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని, బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు.

గౌతంరావుకు సత్కారం



కాచిగూడ: నూతన సంవత్సరం సందర్భంగా బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కోశాధికారి ఎ.సూర్యప్రకాష్‌సింగ్ నేతృత్వంలో పార్టీ నేతలు, కార్యకర్తలు సోమవారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావును కలిసి అభినందించి, ఘనంగా సత్కరించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని గౌతం రావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి


సీఎంకు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ ఇటీవల శాసనసభ ఎన్నికలలో బీసీలకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేర్చాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి బీసీల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ... స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పెంపుదల చేయాలని, ఉప కులాల వారీగా రిజర్వేషన్లను అమలు చేయాలని, సంచార కులాలకు ప్రత్యేకంగా ఐదు శాతం రిజర్వేషన్లును ఏర్పాటు చేయాలని అన్నారు. ఎన్నికల మెనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేర్చాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఏ పథకం చేపట్టిన అది బీసీలకు మేలు చేసే విధంగా ఉండాలని లేఖలో కోరారు.

గుంతల రోడ్లు.. ఇష్టారాజ్యంగా పార్కింగ్!

- రోడ్లను ఇష్టానుసారంగా తవ్వి వదిలేస్తున్న వైనం
- అధ్వానంగా మారిన రోడ్లపై ప్రమాదాలు
- వాహనదారులతోపాటు పాద చారులకూ తప్పని ఇబ్బందులు
- అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా ఆగ్రహం


ఆర్టీసీ కాచిగూడ డిపో రోడ్డులో ఏర్పడిన గుంతలు

కాచిగూడ: అధికారుల నిర్లక్ష్యం వాహన, పాదచారులకు ప్రాణ సంకటంగా మారింది. గుంతలు పడ్డ రోడ్ల మరమ్మతుల విషయంలో అధికారుల ఉదాసీనత, నిర్లక్ష్యం స్థానికంగా ఇబ్బందులను సృష్టిస్తుంది. ఇది రోడ్డు ప్రమాదాలకు కారణమవుతోంది. వరంగల్ జాతీయ రహదారి నుంచి ఆర్టీసీ కాచిగూడ డిపో రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

అధ్వానంగా ఆర్టీసీ డిపో రోడ్డు...

ఆర్టీసీ కాచిగూడ డిపో రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. డిపో రోడ్డులో ఆర్టీసీ క్వార్టర్స్ మధ్యలో ఖాళీగా ఉన్న స్థలాల్లో అంతర్ రాష్ట్ర బస్సు సర్వీసులను పార్కింగ్ చేస్తుంటారు. నిత్యం వందల సంఖ్యలో బస్సుల రాకపోకలు సాగిస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

తరచూ రోడ్డు ప్రమాదాలు...

వరంగల్ జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాలలో వాహనదారులతో పాటు పాదచారులు కూడా గాయాలపాలవుతున్నారు. దీంతో జాతీయ రహదారిపై రాకపోకలు సాగించాలంటేనే స్థానికులు హడలిపోతుంటారు. ముఖ్యంగా ఈ రహదారి మీదుగా తమ పిల్లలను ఒంటరిగా పాఠశాలలకు పంపించాలంటే వారి తల్లిదండ్రులు జంకుతున్నారు.

రోడ్డు డివైడర్లు ఏర్పాటు చేయాలి..

స్థానికుల విజ్ఞప్తి మేరకు జాతీయ రహదారిపై రోడ్డు డివైడర్ల నిర్మాణాన్ని చేపట్టారు. కాచిగూడ కబేళా వైపునకు డివైడర్లను ఏర్పాటు చేసి వదిలేశారు. హర్రాస్‌పెంట హిందూ శ్మశాన వాటిక వద్ద అసలు రోడ్డు డివైడర్లే లేకపోవడం వలన పలు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

అధికారులు స్పందించాలి...

అధికారులు స్పందించి రోడ్డు మర్మతులు వెంటనే చేపట్టాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. హిందూ శ్మశాన వాటిక వద్ద రోడ్డు డివైడర్‌ను ఏర్పాట చేసి ప్రమాదాలను నివారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


కాచిగూడ ఆర్టీసీ క్వార్టర్స్ వద్ద ఖాళీ స్థలంలో నిలిపిన బస్సులు

హెబ్రోన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు


గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


సందేశం ఇస్తున్న బ్రదర్ జోసప్ కురియన్, వీరాచారి

చిక్కడపల్లి: గోల్కొండ చౌరస్తాలోని ప్రముఖ హెబ్రోన్ చర్చిలో నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దైవ సేవకులు బ్రదర్ జోసప్ కురియన్ మాట్లాడుతూ... నూతన సంవత్సరంలో యేసు దీవెనలతో ప్రజలందరూ సుఖ శాంతులలో, సంతోషంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేయడం జరిగిందన్నారు. ఏసు బోధనసల ద్వారా మానవాళికి సన్మార్గంవైపు నడిపించేలా ఏసుక్రీస్తు మార్గనిర్దేశం చేశారని పేర్కొన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శప్రాయం అని పేర్కొన్నారు. సొసైటీ ప్రధాన కార్యదర్శి ఆర్.వీరాచారి మాట్లాడుతూ... బ్రదర్ భక్తసింగ్ స్థాపించిన హెబ్రోన్ చర్చికి ఎంతో విశిష్టత ఉందని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరాముడి పాదాల ఊరేగింపు


శ్రీరాముడి పాదాలను ఊరేగిస్తున్న పీఅండ్‌టీ కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, లత తదితరులు

ముషీరాబాద్: అయోధ్య రామమందిరంలో ఏర్పాటు చేసే శ్రీరాముని పాదాలను సోమవారం పీఅండ్‌టీ కాలనీలో కాలనీ వాసులు భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, లత, వినోద్ మాట్లాడుతూ... రామామృత తరంగిణి ట్రస్ట్ ఆధ్వర్యంలో కర్ణాటకలోని సృంగేరి పీఠం భారతి తీర్థస్వామి ఆశీస్సులతో వెలువడిన శ్రీరామ పాదాలను ఇంటింటికీ తీసుకెళ్లి భక్తులకు దర్శనం కల్పిస్తున్నాం అన్నారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహిస్తూ అర్చనలు చేస్తున్నారని తెలిపారు. ఈ నెల 8వ తేదీన అయోధ్య రామమందిరానికి శ్రీరాముని పాదాలను తరలించనున్నట్లు వారు తెలిపారు.

నేటి నుంచి మళ్లీ ప్రజాపాలన



బంజారాహిల్స్: రెండు రోజుల సెలవుల అనంతరం ప్రజాపాలన కేంద్రాలు తిరిగి మంగళవారం తెరుచుకోనున్నాయి. ప్రజలు తమకు నిర్దేశించిన ప్రాంతాల్లో తమ సమస్యలతో కూడిన తమకు కావలసిన అభ్యర్థనలతో అభయహస్తం దరఖాస్తులను అందించవచ్చని అధికారులు తెలిపారు. భారీ సంఖ్యలో ప్రజలు కేంద్రాలకు విచ్చేస్తుండడంతో అన్ని కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేసినట్లు జీహెచ్ఎంసీ సర్కిల్-18 డీఎంసీ ప్రశాంత్ తెలిపారు. తమ సమస్యలను తెల్ల కాగితంపై రాసిచ్చినా సంబంధిత సిబ్బంది తీసుకుంటారని, అభయహస్తం దరఖాస్తుల కోసం ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వవద్దని, వీటిని పూర్తిగా ఉచితంగా కేంద్రాల వద్ద సిబ్బంది అందజేస్తారని తెలిపారు.

ప్రజాపాలన కేంద్రాలివే...

- బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12 సీఎంటీసీ బిల్డింగ్‌లో ఎన్‌బీటీనగర్ బస్తీవాసులకు..
- బంజారాహిల్స్‌రోడ్డు నెంబర్-13 నీటి పారుదల శాఖ కార్యాలయంలో ఉదయ్‌నగర్ బస్తీవాసులకు..
- ఎన్‌బీనగర్ కమ్యూనిటీహాల్‌లో శ్రీరామ్‌నగర్ బస్తీవాసులకు..
- ప్రేమ్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో భోళానగర్ బస్తీవాసులకు..
- బంజారాహిల్స్ రోడ్డునెంబర్-7 మీ-సేవా వార్డు కార్యాలయంలో సుభ్‌దేవ్‌నగర్ బస్తీవాసులకు
- ఇబ్రహీంనగర్ కమ్యూనిటీ హాల్‌లో గ్రీన్‌వ్యాలీ కాలనీవాసులకు..
- ప్రతాప్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో దోభీఘాట్ పంజగుట్ట వాసులకు..
- గౌరీశంకర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో సింగాడబస్తీవాసులకు..
- జూబ్లీహిల్స్ వార్డు కార్యాలయంలో గాయత్రీహిల్స్ కాలనీవాసులకు..
- ఫిల్మ్‌నగర్ భగత్‌సింగ్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఫిలింనగర్ స్వామి వివేకానంద బస్తీవాసులకు..
- జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో దుర్గాభవానీనగర్ బస్తీవాసులకు..
- గౌతమ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో వినాయకనగర్ బస్తీవాసులకు.

35 డీడీ కేసుల నమోదు

చిక్కడపల్లి: చిక్కడపల్లి ట్రాఫిక్ పీఎస్ పరిధిలో డిసెంబర్ 31 రాత్రి డ్రంకెన్ డ్రైవ్ (డీడీ) కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ఎస్.వీరేశం తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ... రాత్రి 10 నుంచి తెల్లవారు జామున 3 గంటలకు చిక్కడపల్లి మెట్రో స్టేషన్, ఆర్టీసీ క్రాస్ రోడ్, ట్యాంక్ బండ్ తదితర ప్రాంతాల్లో తనిఖీల్లో 35 కేసులు నమోదయ్యాయని వివరించారు. మద్యం సేవించి ఎవరూ వాహనాలు నడపవద్దని ఆయన సూచించారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు వినతిపత్రం సమర్పించారు. సోమవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకోని గవర్నర్‌కు తెలంగాణ గౌడ సంఘాల సమన్వాయ కమిటి రాష్ట్ర అధ్యక్షులు బాలగౌనీ బాలరాజ్‌గౌడ్, బీసీ సంఘాల రాష్ట్ర కన్వీనర్ కుందారం గణేష్‌చారి గవర్నర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గీతాకార్మికుల సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి తగిన సిఫారస్సు చేయాలని వారు కోరారు.

మనువాద మాఫియా రాజకీయాలను ఓడించాలి



లిబర్టీ: మహర్ రెజిమెంట్ వీరుల పోరాట స్ఫూర్తితో మనువాద మాఫియా రాజకీయాలను ఓడించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సమాజానికి పిలుపునిచ్చారు. సోమవారం భీమా కోరేగావ్ మహర్ రెజిమెంట్ శౌర్య దివాస్ 206 విజయోత్సవాల సందర్భంగా ట్యాంక్‌బండ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత బహుజన పార్టీ కార్యకర్తలు నిర్వహించిన ప్రదర్శనలో కృష్ణ స్వరూప్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వి.ఎల్. రాజు, పార్టీ గ్రేటర్ అధ్యక్షుడు మద్దెల ప్రవీణ్‌కుమార్, గ్రేటర్ మహిళా అధ్యక్షురాలు బండారి లావణ్య, దళిత బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఇటికాల గణేష్, పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బుంగా జయరాజు, నాయకులు సి.హెచ్.కరుణాకర్, ఎస్.రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

నవనీత శోభితుడైన విజయగణపతి



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-14లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఆవరణలో కొలువుదీరిన శ్రీ విజయగణపతి స్వామిని నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం వెన్నతో అలంకరించారు. సర్వాంగ సుందరంగా నవనీత అలంకరణలో దర్శనమిచ్చిన స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి భారీ సంఖ్యలో విచ్చేశారు. ఇందులో భాగంగా విశేష పూజలు, హోమాలు నిర్వహించారు.

సహపంక్తి భోజనంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్


సహపంక్తి భోజన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

ముషీరాబాద్: భోలక్‌పూర్ పద్మశాలీ కాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం పద్మశాలీ కాలనీలో 500 కుటుంబాలు ఒకే చోట భోజనం చేసి తమ ఐక్యతను చాటుకున్నారు. కాలనీవాసులు తమ ఇండ్లలో జనవరి 1వ తేదీన వంటలు చేయకుండా అందరూ కలిసిమెలిసి తమ కష్టసుఖాలు పాలు పంచుకునేందుకు సహపక్తి భోజనం కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తున్నారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యే కొదండరెడ్డి, బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్ రావు, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బింగి నవీన్, సంగిశెట్టి జగదీష్, మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, బీజేపీ మహంకాళీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీకే శంకర్‌రావులు కాలనీ వాసులు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ... కాలనీ వాసులకు అన్ని విధాలా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. కాలనీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు సుందర్ పటాలే, ఆర్.ఆంజనేయులు, ఉపాధ్యక్షులు విశ్వేశ్వర్, గోవింద్‌రాజు, శ్రీనివాస్ పటాలే, నాయకులు కమల్‌కుమార్‌శర్మ, సుజాత, తేజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో పరిపూర్ణ ఆరోగ్యం

ఉప లోకాయుక్త నిరంజన్‌రావు


విద్యార్థులకు బ్లాక్ బెల్టులను పంపిణీ చేస్తున్న ఉప లోకాయుక్త నిరంజన్‌రావు

కాచిగూడ: కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరాటే విద్యార్థులకు బ్లాక్ బెల్టులను ఉప లోకాయుక్త నిరంజన్‌రావు ప్రదానం చేశారు. బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ఉత్తీర్ణులైన 9 మందిలో బ్లాక్ బెల్ట్ సెకండ్ డాన్ విభాగంలో శ్యాంకుమార్, హంస, అమృత రెడ్డి, గణ సంతోషిణిరెడ్డి, బ్లాక్ బెల్ట్ ఫస్ట్ డాన్ విభాగంలో నందిని, బ్లాక్ బెల్ట్ విభాగంలో వర్ధిని, మేధా, రిషిత, అవిఘ్న వెంకటరెడ్డి బెల్ట్ గ్రేడింగ్‌లు పొందారు. ముఖ్య అతిథిగా నిరంజన్ రావు పాల్గొని మాట్లాడుతూ... యువతతో పాటు బాలికలు బ్లాక్‌బెల్ట్ సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కరాటే విద్య ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైనదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ మహిళా విద్యా సంఘం కార్యదర్శి ప్రొఫెసర్ ముత్యంరెడ్డి, సీనియర్ అడ్వకేట్ అశోక్ కుమార్, డాక్టర్ కృష్ణారెడ్డి, కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్.గోపాల్‌రెడ్డి, ప్రొఫెసర్ ఉమా మహేశ్వర్, డాక్టర్ వరుణ్య, మాస్టర్ నర్సింగ్‌రావు, కరీం తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ షెడ్డు నిర్మాణ పనుల ప్రారంభం


షెడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని శ్రీ సాయిబాబా దేవాలయం ప్రాంగణంలో సుమారు రూ. 50 లక్షల వ్యయంతో చేపట్టనున్న షెడ్డు నిర్మాణ పనులను సోమవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్థానిక కార్పొరేటర్ రవిచారితో కలిసి ప్రారంభించారు. ఈ షెడ్డు నిర్మాణానికి తంజావూరి సుమన్‌కుమార్ ఆర్థిక సహాయాన్ని అందజేయనున్నారు. అనంతరం సాయిబాబా దేవాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకులు ముఠా జైసింహ, ఆలయ వైస్ చైర్మన్ పెద్దోళ్ల గంగారెడ్డి, మేనేజర్ ప్రకాష్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకటకృష్ణారావు(బబ్లూ), డివిజన్ ప్రధాన కార్యదర్శి మన్నె దామోదర్‌రెడ్డి, సుందరయ్య పార్కు అధ్యక్షుడు ఎస్.రమేష్‌రెడ్డి, మనోహర్ రెడ్డి, వెంకటస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సిండికేట్ బ్యాంక్ ఎంప్లాయీస్ మాక్ సొసైటీ కార్యవర్గం



కాచిగూడ: సిండికేట్ బ్యాంక్ ఎంప్లాయీస్ మాక్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం కాచిగూడలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడిగా సయ్యద్ ఇక్బాల్, ఉపాధ్యక్షుడిగా వెంకటి, కార్యదర్శిగా పరమేశ్వర్, కోశాధికారిగా వినోద్ ఎన్నికయ్యారు. రంగారెడ్డి జిల్లా సభ్యుడిగా లక్ష్మయ్య ఎన్నికలలో విజయం సాధించగా నిజామాబాద్ జిల్లా శ్రీకాంత్, వరంగల్ జిల్లా నుంచి వీరేశం సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కెనరా బ్యాంక్ వర్కింగ్ ఎంప్లాయీస్ యూనియన్ జాతీయ కార్యదర్శి నరేష్ బాబు, చైర్మన్ రమణ, వీరిని సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.శ్రీనివాస్, హన్మంతరావు, వెంకటేశ్వర్లు, అబ్దుల్ హాయ్, ఎస్. శ్రీను, దినేష్, అనిల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సినీ రంగానికి జగ్గయ్య సేవలు చిరస్మరణీయం


అవార్డులను ప్రదానం చేస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: భారతీయ సినిమా రంగానికి డాక్టర్ కొంగర జగ్గయ్య ఎనలేని కృషి చేశారని నేటి నిజం పత్రికా సంపాదకుడు బైసా దేవదాసు అన్నారు. సోమవారం రాత్రి మానస థియేటర్స్ త్యాగరాయ గానసభల సంయక్తాధ్వర్యంలో ప్రముఖ సినీ నటుడు, కళా వాచస్పతి దివంగత కొంగర జగ్గయ్య జయంతిని నిర్వహించారు. గుండవరపు హనుమంతరావు హాలులో నిర్వహించిన కొంగర జగ్గయ్య స్మారక అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సినీ నటుడు ఆనంద చక్రపాణి, ప్రముఖ కవి మాయకుంట్ల నారాయణరెడ్డిలకు అవార్డులను ప్రదానం చేసి సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుభాషా కవి సమ్మేళనంలో కవులు, కవయిత్రులు పాల్గొని స్వీయ కవితలను చదివారు. ప్రముఖులు రాధాకుసుమ, రామచంద్రరావు, రఘుశ్రీ, రాణి తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన నూతన సంవత్సర వేడుకలు


డాక్టర్ లక్ష్మణ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న దృశ్యం

కవాడిగూడ: కవాడిగూడలో నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. చిన్నాపెద్దా తేడాలేకుండా డ్యాన్స్‌లు వేస్తూ వేడుకలు జరుపుకొన్నారు. రాత్రి 12 గంటల సమయంలో కేక్‌లు కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. నూతన సంవత్సరం తొలిరోజు సందర్భంగా సోమవారం తెల్లవారు జామునుంచే కవాడిగూడలో ఉన్న ఆలయాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌ను సోమవారం ఆయన నివాసంలో ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గంటా శ్రీనివాస్, ముషీరాబాద్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఎం.రమేష్ రాం, బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్, రంగరాజ్‌గౌడ్‌లు పూలబొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కవాడిగూడలోని పలు ప్రాంతాలలో మహిళలు, పోటాపోటీగా తమ ఇళ్లముందు ముగ్గులు వేసి వారి ప్రతిభను చాటుకున్నారు.

పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా గౌస్‌ఖాన్

బంజారాహిల్స్: పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా గౌస్‌ఖాన్‌ను నియమిస్తూ నగర పోలీస్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో గౌస్‌ఖాన్ సోమవారం పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఆయన సౌత్ జోన్ ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. విధి నిర్వహణలో సమర్థుడిగా పేరున్న గౌస్‌ఖాన్‌ను కీలకమైన, రద్దీగా ఉండే పంజగుట్ట ట్రాఫిక్‌కు బదిలీ చేశారు.